సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం : 10 : సెప్టెంబర్ : 2023



మహనీయుడు కాళోజీ

తెలంగాణ భాష, యాస గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు కాళోజీ అని వక్తలు కొనియాడారు. - IIIలో



'జీ-20' సదస్సులో జిగేల్

జీ-20 శిఖరాగ్ర సమావేశంలో ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటు దక్కింది. - IVలో



సమ్మె బాటలో అంగన్‌వాడీలు

డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు ఈ నెల 11 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. - IVలో

న్యూస్‌రీల్

నేడు ఐలమ్మ వర్ధంతి

భువనగిరి టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని, బీసీ కుల సంఘ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రెగ్యులరైజ్ చేసే వరకు ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరిటౌన్ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి తొమ్మిదవ రోజుకు చేరాయి. దీక్షలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు మంగ పాండరి, దొమ్మాట భాస్కర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు మూల స్తంభంగా ఉన్న సమగ్ర శిక్షను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నాగార్జున, తిరుపతి, శ్రావణ్, రామయ్య, చందర్, రవి ప్రసాద్, మోహనాచారి, లింగయ్య, యాదగిరి, నందు, బసవలింగం, సునీత, చైతన్య, కవిత, రేఖ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలు



మాట్లాడుతున్న పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి

వలిగొండ : పాలకవర్గం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన సేవలు అందజేసేందుకు కృషి చేస్తామని వలిగొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం వలిగొండలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సహకారంతో నిధులు సమకూర్చుకొని వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్‌గౌడ్, బోళ్ల లలితా శ్రీనివాస్, సూర్యకంటి వెంకట్‌రెడ్డి, మర్రి వెంకటేశం, వడిచెర్ల మల్లేశం, మధు గౌడ్, కందుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలం పరిశీలన



చెరువు శిఖాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఇరిగేషన్ ఈఈ

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని దాతర్‌పల్లి మధిర గొల్లగుడిసెల గ్రామంలో కబ్జాకు గురైన చెరువు శిఖం భూమిని శనివారం ఇరిగేషన్ ఈఈ పరిశీలించారు. చెరువు శిఖాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన చెరువును సందర్శించారు. శిఖం భూమిలో నాటిన కడీలు తొలగించాలని, అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు జమియత్ ఉలేమాయే మహాసభ

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జమియత్ ఉలేమాయే మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫీజ్ సాబీర్ తెలిపారు. శనివారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో దారుల్ ఉలూమ్ మజీద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సభలో జమియత్ ఉలేయా హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహబూబ్ అసద్ మదానీ పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో జమియత్ సంస్థ నల్లగొండ అధ్యక్షుడు మౌలానా ఎహసానుద్దీన్ ఖాస్మీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ సయ్యద్ సిద్దిక్ అహ్మద్ మజాహిరి, ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్‌ఖాన్ అసదీ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మేటి!

స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 అవార్డులకు చేరువలో మూడు మున్సిపాలిటీలు

- ఫీడ్ బ్యాక్ నమోదులో మోత్కూర్ ఫస్ట్, యాదగిరిగుట్ట రెండవ స్థానం
- నాలుగో స్థానంలో భువనగిరి
- ఆలేరు, భూదాన్‌పోచంపల్లి వెనుకంజ
- అక్టోబర్ 2న ర్యాంకుల ప్రకటన



మోత్కూరు పట్టణ వ్యూ

భువనగిరిటౌన్ : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డులకు జిల్లాలోని పలు మున్సిపాలిటీలు చేరువయ్యాయి. పారిశుధ్యం, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. పారిశుధ్య సేవలపై ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఓటు వేసేలా విస్తృత ప్రచారం కల్పించడం కలిసొచ్చింది. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో మోత్కూరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో వంద శాతానికి పైగా ప్రజలు సానుకూలంగా ఓటేశారు. ఈ రెండు పట్టణాలు రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండవ స్థానంలో నిలిచాయి. మిగతా విభాగాల్లో భువనగిరి నాలుగు, చౌటుప్పల్ ఆరో స్థానాన్ని దక్కించుకున్నాయి. జూలై 5వ తేదీన మొదలైన ప్రజాభిప్రాయ సేకరణ అగస్టు 31వ తేదీన ముగిసింది. అక్టోబర్ 2న ర్యాంకులు ప్రకటించనున్నారు.

ఈ అంశాలపై..

మున్సిపాలిటీల్లో జనాభా ఆధారంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మొత్తం జనాభాలో 60 శాతం మంది అభిప్రాయాలు నమోదు చేయాలి. ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా, తడిపొడి చెత్తను వేర్వేరుగా ఇస్తున్నారా, డ్రెయినేజీలు శుభ్రంగా ఉన్నాయా, పబ్లిక్ టాయిలెట్లు వాడుతున్నారా, శుభ్రంగా ఉన్నాయా అనే వివరాలతో పాటు పట్టణంలో పరిశుభ్రతకు ఎంత రేటింగ్ ఇస్తారనే ప్రశ్నలకు అభిప్రాయాలు సేకరించారు. ఇందుకోసం మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు వార్డుల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రజలు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌లో ఫీడ్ బ్యాక్ నమోదు చేసేలా ప్రచారం చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ ఇలా..

మున్సిపాలిటీ	ఫీడ్ బ్యాక్ లక్ష్యం	ఫీడ్ బ్యాక్ చేసిన సంఖ్య	శాతం
మోత్కూరు	15,924	20,293	127.4
యాదగిరిగుట్ట	15,661	16,637	106.2
పోచంపల్లి	17,010	46,50	27.3
ఆలేరు	17,120	3,709	21.3
చౌటుప్పల్	31,263	17,491	55.9
భువనగిరి	53,339	26,338	48.4

9,500 మార్కులకు పోటీ

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల మధ్య స్వచ్ఛతలో పోటీ పెంచేందుకు ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఇస్తోంది. పరిశుభ్రత, డ్రెయినేజీ చెత్త సేకరణ, తడి, పొడి చెత్త నిర్వహణ, టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ఇంకుడు గుంతలు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సంవత్సరం 9,500 మార్కులకు పోటీ జరుగుతుంది. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525 మార్కులు, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులు కేటాయించారు. ఈ మార్కుల ఆధారంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటిస్తుంది.

మూడు విభాగాల్లో..

- 15 వేల నుంచి 20 వేల జనాభా విభాగంలో మోత్కూర్ మున్సిపాలిటీ 127.3 శాతం ప్రజల ఫీడ్ బ్యాక్‌తో మొదటి స్థానం, యాదగిరిగుట్ట 106.2 శాతం రెండవ స్థానంలో ఉంది. ఇదే విభాగంలో భూదాన్ పోచంపల్లి 27.3 శాతంతో 15వ స్థానం, ఆలేరు 21.3 శాతంతో 25వ స్థానంలో నిలిచింది. ఈ రెండు మున్సిపాలిటీల యంత్రాంగం ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణలో వెనుబడ్డాయి.
- 25వేల నుంచి 50 వేల జనాభా విభాగంలో 55.9వ శాతంతో చౌటుప్పల్ 6వ స్థానంలో నిలిచింది.
- 50వేల నుంచి లక్ష జనాభా విభాగంలో భువనగిరి మున్సిపాలిటీ నాలుగో స్థానంలో నిలిచింది.

మంచి ర్యాంక్‌కు అవకాశం ఉంది



స్వచ్ఛ్ సర్వేక్షణ్- 2023 ఫీడ్ బ్యాక్‌లో భువనగిరి మున్సిపాలిటీకి కేటాయించిన విభాగంలో రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో ఉంది. ఇప్పటికే రెండు సార్లు కేంద్ర సర్వే బృందాలు ఫీడ్ బ్యాక్ నమోదు చేశాయి.మరో సారి సర్వేకు రానున్నారు. మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో మంచి ర్యాంక్ వచ్చే అవకాశం ఉంది.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

శ్రమకు తగిన ఫలితం



స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేశాం. చేపట్టిన కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రచారం కల్పించాం. పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాం. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాం. మా శ్రమకు తగిన ఫలితం రాబోతుంది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం దాదాపు ఖరారైనందుకు సంతోషంగా ఉంది.

–శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

● ఉత్సాహంగా ఉట్లోత్సవం



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఉట్లోత్సవంలో ఉట్టి కొడుతున్న భక్తులు, ఆలయ సిబ్బంది

వాసాలమర్రి ఆదర్శంగా నిలవాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- పునర్నిర్మాణ పనుల పరిశీలన, సమీక్ష



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

తుర్కపల్లి : ముఖ్యమంత్రి దత్తత గ్రామం వాసాలమర్రి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా పునర్నిర్మాణం జరగాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. అధికారులు, గ్రామస్తులతో సమావేశమై పనులపై సమీక్షించారు. పునర్నిర్మాణంలో భాగంగా గ్రామంలో 481ఇళ్లను నిర్మించడానికి లే ఆవుట్ తయారు చేసినట్లు తెలిపారు. ఇందులో 103 పక్కా గృహాలు, 336 పెంకుటిల్లు ఉన్నాయన్నారు. అదే విధంగా ఇళ్లు సరిగా లేని కుటుంబాలు, వేరే చోట నివసిస్తున్న వారిని, ఎటువంటి ఆధారం లేని కుటుంబాల వివరాలు మూడు రోజుల్లో సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ పలుగుల నవీన్‌కుమార్, పంచాయతీ రాజు ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి

భువనగిరి : లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కె.మారుతిదేవి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. న్యాయసేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయన్నారు. తగాదాలకు వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఆర్థికంగా, సామాజికంగా కుంగిపోవద్దన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను లోక్ అదాలత్‌తో పరిష్కరించుకోవచ్చన్నారు. అదనపు డీసీపీ రవికుమార్ మాట్లాడుతూ రాజీపడదగ కేసులకు మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య, ప్రధాన జూనియర్ జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, స్పెషల్ మెజిస్ట్రేట్ జావిద్, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, పీపీ సత్యనారాయణ, ఏపీపీ సౌజన్య, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 5,324 కేసులు పరిష్కారం

జిల్లాలోని కోర్టుల్లో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 5,324 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ 42, క్రిమినల్ 4,173, ఎస్‌బీఐ, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 36, ఇతర కేసులు 1,070 ఉన్నాయి.

అసెంబ్లీ ఎన్నికల కమిటీల్లో చోటు

- మేనిఫెస్టో కమిటీలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో ఉత్తమ్‌పద్మావతికి చోటు



దామోదర్‌రెడ్డి



ఉత్తమ్‌పద్మావతి



స్రవంతి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు వేగవంతం చేసింది. ఈ మేరకు ఏఐసీసీ పలు కమిటీలను నియమించింది. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలకు స్థానం కల్పించింది. మేనిఫెస్టో కమిటీలో 24 మందికి అవకాశం కల్పించగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి, మునుగోడు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాపోలు జయప్రకాశ్‌కు చోటు దక్కింది. శిక్షణ కమిటీలో సూర్యాపేట నుంచి డాక్టర్ రవిబాబుకు అవకాశం కల్పించింది. స్ట్రాటజీ కమిటీలో పాల్వాయి స్రవంతికి చోటు కల్పించింది.

రెవెన్యూ డివిజన్‌తోనే ఆలేరు అభివృద్ధి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు

ఆలేరురూరల్ : రెవన్యూ డివిజన్ ఏర్పాటైతేనే ఆలేరు అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక రైల్వే గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1952లో ఆలేరు నియోజకవర్గం ఏర్పడినా ఇప్పటి వరకు అభివృద్ధి జరగలేదన్నారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, సాగునీటితో పాటు వివిధ రంగాల్లో వెనుబడి ఉందన్నారు. ఆలేరు అభివృద్ధిని ఎమ్మెల్యే కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అన్ని అర్హతలు ఉన్న ఆలేరును ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాస్తారోకోలు, ధర్నాలు చేసినా స్పందించడం లేదన్నారు. ఈనెల 12న బైక్ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ధర్నా పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పసుపునూరి వీరేషం, రాకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, క్బాల్, సలీం, బడుగు జహంగీర్, పాల్, చంద్రశేఖర్, సత్యం, ఉపేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోనూ ఫుల్ డిమాండ్!

- అసెంబ్లీ టికెట్‌ల కోసం రాష్ట్ర కార్యాలయానికి క్యూ
- భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల నుంచి పది మందికి పైగా దరఖాస్తు
- నేడు మరికొందరు..





భువనగిరి టికెట్ కోసం దరఖాస్తులు అందజేస్తున్న గూడూరు నారాయణరెడ్డి, మాయ దశరథ

సాక్షి,యాదాద్రి : బీజేపీలోనూ ఎమ్మెల్యే టికెట్‌లకు ఫుల్ డిమాండ్ కనిపిస్తోంది. ఆశావహులు వారి అనుచరులతో కలిసి రాష్ట్ర కార్యాలయానికి క్యూ కడుతున్నారు. మొదటి రెండు రోజులు పెద్దగా స్పందన లేనప్పటికీ శనివారం పది మంది వరకు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు భువనగిరి నియోజకవర్గం నుంచి నలుగురు, ఆలేరు నుంచి ఆరుగురు దరఖాస్తులు సమర్పించారు.తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల నుంచి సైతం ఆశావహులు పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్నారు. దరఖాస్తుకు నేడు చివరి గడువు కావడంతో ఆశావహుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

టికెట్ వేటలో ఆశావహులు

అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా బరిలో నిలవాలని పలువురు ఆశావహులు పట్టుదలతో ఉన్నారు. ముందునుంచి పార్టీలో సభ్యులుగా కొనసాగుతున్న వారితో పాటు ఇతర పార్టీల నుంచి హామీ తీసుకొని వచ్చిన వారు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమ బలం,బలగంతో అధిష్ఠానాన్ని మెప్పించి, టికెట్ పొందేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మరికొంత మంది తమ గాడ్‌ఫాదర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఈనెల 17న అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించే అవకాశం ఉన్నందున కొందరు ఢిల్లీ విమానం ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా సర్వే నివేదిక ఆధారంగా టికెట్ కేటాయించే అవకాశం ఉన్నందున ఆశావహులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.



ఆలేరు నుంచి పడాల శ్రీనివాస్

తొలి విడతలో ఎవరికో?

అధికార బీఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ బరిలో దిగేదెవరో తేలిపోయింది. కాంగ్రెస్ అధిష్ఠానం దరఖాస్తులను వడబోసి తొలి జాబితా విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. బీజేపీ సైతం అభ్యర్థుల ఎంపికకు కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే పలువురి బలమైన నేతల వివరాలను పార్టీ నాయకత్వం రహస్యంగా సేకరించినట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారుల్లో వారున్నారా.. కొత్త వ్యక్తులున్నారా అనేక కోణంలో పరిశీలన చేయనుంది. మొత్తంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు దీటుగా అభ్యర్థులను రంగంలోకి దించే పనిలో బీజేపీ నాయకత్వం నిమగ్నమైంది. సామాజిక సమీకరణలు, ఆర్థిక, అంగబలం, ప్రజలతో ఉన్న సంబంధాలు, పార్టీలో అతని పాత్ర తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని కసరత్తు చేస్తున్నారు.

నేటితో ముగియనున్న గడువు

దరఖాస్తు గడువు ఆదివారంతో ముగియనుంది. చివరి రోజు పలువురు ముఖ్య నేతలు, సీనియర్లు దరఖాస్తు చేయడానికి సిద్ధమవుతున్నారు.

దరఖాస్తులు ఇలా..

- భువనగిరి నుంచి గూడూరు నారాయణరెడ్డి, మాయ దశరథ, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, సీఎన్‌రెడ్డి, కేసారం కృష్ణారెడ్డి ఉన్నారు. నేడు పాశం భాస్కర్ దరఖాస్తు చేయనున్నారు.
- ఆలేరు నుంచి పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, రచ్చశ్రీనివాస్, బొమ్మగాని రాజమణి, కల్లెం శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల భాస్కర్‌రెడ్డి.

లప్పానాయక్ తండా బాధ్యత నాదే

- నూతన గ్రామాన్ని అందంగా నిర్మించుకుందాం
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



దాతర్‌పల్లిలో పునరావాస గ్రామానికి శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్ : ఊరును కోల్పోతున్నామన్న బాధను మర్చిపోయి, పునరావాస గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుకుందామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న లప్పానాయక్‌తండా వాసులకు దాతర్‌పల్లిలో నిర్మించనున్న పునరావాస గ్రామానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరినీ ఒక కుటుంబంగా పరిగణించి, ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చిందన్నారు.తొలుత చేపట్టిన సర్వేలో 306 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా ఇప్పుడవి 327కు చేరాయన్నారు. వారందరికీ లేఅవుట్ చేసి, ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.7.61 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. పునరావాస గ్రామంలో విశాలమైన రోడ్లు, పాఠశాల, గ్రామ పంచాయతీ, కమ్యూనిటీ భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ నీరు, విద్యుత్ సౌకర్యం ఉంటుందన్నారు. ఊరును కోల్పోతే ఎవరికైనా బాధ ఉంటుందని, దాన్ని మర్చిపోయి కొత్త గ్రామంలోకి వెళదామని తండావాసులకు ధైర్యం చెప్పారు. మరో ఆరు నెలల్లో సంపూర్ణంగా కొత్త గ్రామం ఏర్పడుతుందని, అదుకు పూర్తి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ ధీరావత్ బుజ్జి, ఎంపీటీసీ అయిలయ్య, ఇరిగేషన్, పంచాయతీ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

తండావాసుల కన్నీటి పర్యంతం

సర్వస్వం కోల్పోయి, వేరే చోటకు వెళ్లనున్న లప్పానాయక్ తండావాసులు కన్నీరుపెట్టుకున్నారు. దశాబ్దాలుగా అందరం ఒకే చోట సహవాసం చేశామని, ఇప్పుడు కొత్త చోటుకు వెళ్లాలంటే బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో ఘటనలు

సూర్యాపేట క్రైం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో జరిగిన ఘటనల వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేటలోని శాంతినగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం దురాజ్‌పల్లి నుంచి వరిపొట్టు లోడ్‌తో బీబీగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న చివ్వెంల మండలం పాండ్యానాయక్ తండాకు చెందిన భద్రమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. అదే ట్రాలీపై కూర్చున్న మంగమ్మ, లునావత్ భీమాతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ ధరావత్ హట్టీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ టైరు పేలి అదుపుతప్పడంతో..


మృతి చెందిన సతీష్

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలకంఠం సతీష్ (31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన స్నేహితుడికి చెందిన ద్విచక్రవాహనంపై ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి తన వ్యక్తిగత పనిమీద వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ టైరు పేలి, వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో సతీష్ తలకు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని..


తేజ్ (ఫైల్)

భువనగిరి: భువనగిరి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రాచమల్ల తేజ్ (26) డ్రైవింగ్‌తో పాటు శుభకార్యాలకు డెకరేషన్ చేస్తుంటాడు. ఉదయం తన సొంత పని నిమిత్తం రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వలిగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

ఆత్మకూరు(ఎం): మండలంలోని తుక్కాపురంలో ఈ నెల 4న పానగాని స్వామి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ మొగిలయ్య, సీఐ మోతిరామ్ నేతృత్వంలో ఆత్మకూరు(ఎం) ఎస్ఐ నాగరాజుతో పాటు పోలీసులు నాలుగు రోజులపాటు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతూ తిరుగుతుండగా పోలీసులకు అనుమానం రావడంతో పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితులు నేరం అంగీకరించారు. నిందితులు భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన గుమ్మడి రాంబాబు, అతని భార్య లలితగా గుర్తించారు. సంఘటనకు రెండు రోజుల ముందు భార్య లలిత గ్రామంలో రెక్కీ నిర్వహించి సమాచారం అందజేయడంతో భర్త గుమ్మడి రాంబాబు చోరీకి పాల్పడి 12తులాల బంగారు పుస్తెలతాళ్లు, రూ. 25వేల నగదును అపహరించుకుపోయాడు. ఈ నగదు, సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి సకాలంలో నిందితులను పట్టుకున్నందుకు ఆత్మకూరు(ఎం) ఎస్ఐ నాగరాజును, పోలీస్ సిబ్బందిని డీసీపీ రాజేష్‌చంద్ర అభినందించారు.

డీజిల్ దొంగల అరెస్టు

భువనగిరి: ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ సుధీర్ తెలిపారు. ఈ నెల 7న పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో సింగన్నగూడెం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆగి ఉన్న లారీ డీజిల్ ట్యాంకర్ తాళం తెరిచి సుమారు 245 లీటర్ల డీజిల్‌ను క్యాన్లలో నింపుకుని పారిపోయారు. లారీ యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక డాల్ఫిన్‌హోటల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నారాయణపేట జిల్లాకు చెందిన అంగోతు రమేష్, పాల్తీయ సురేందర్‌లు వాహనంలో హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వస్తున్నారు. అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. కాగా.. రమేష్, సురేందర్‌లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వస్తున్న ఆదాయం సరిపోక డీజిల్ చోరీ చేసి, డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 2018లో మహమూబ్‌నగర్‌రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ నుంచి డీజిల్ దొంగతనం చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. అనంతరం మక్తల్‌లో నార్వ, కొత్తపేట ఓల్డ్ స్టేషన్ల పరిధిలో చేసిన దొంగతనం కేసు విషయంలో కూడా జైలుకు వెళ్లారు. భువనగిరిలో జరిగిన దొంగతనం కేసులు రమేష్, దీరావత్ రవినాయక్‌తో పాటు సురేందర్‌లు చోరీ చేసిన డీజిల్‌ను హైదరాబాద్‌లోని బోరబండలో అన్వర్ అనే వ్యక్తికి విక్రయించారు. రమేష్, సురేందర్‌లను పట్టుకుని, వారి నుంచి రూ.14 వేల నగదు, కారు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట): ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గుండ్లపల్లి వెంకన్న కుమార్తె భవాని (21)కి తడకమళ్ల గ్రామానికి చెందిన బాదరబోయిన కోటయ్యతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 7వ తేదీన భర్తతో గొడవపడిన భవాని అదే రోజు రాత్రి ఏపూరుకు తన తల్లిగారింటికి వచ్చింది. 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఇప్పటి వరకు ఆచూకీ లేకపోవడంతో తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం


మగబిడ్డకు జన్మనిచ్చిన యస్మీనాబేగం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. తిరుమలగిరి మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన షేక్ యస్మీనాబేగంకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది గ్రామానికి చేరుకొని యస్మీనాబేగాన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స నిమిత్తం తల్లీబిడ్డను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి


చాట్ల తిరుపతి వెంకయ్య (ఫైల్)

మేళ్లచెరువు: ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మేళ్లచెరువు మండలంలోని రామాపురం పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన చాట్ల తిరుపతి వెంకయ్య (30) స్థానిక సిమెంట్ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. రైలును గమనించకుండా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు రైల్వే పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య శిరీష గర్భిణి కాగా ఒక కుమారుడు ఉన్నారు.

మట్టపల్లిలో కృష్ణాష్టమి పూజలు

మఠంపల్లి: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం మట్టపల్లి శ్రీలక్ష్మినరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదవీడుకు చెందిన యాదవులచే ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లు కొట్టే కార్యక్రమం అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయకుమార్, ఈఓ నవీన్, అర్చకులు, యాదవులు, భక్తులు పాల్గొన్నారు

శిక్షణ కాలం సంతృప్తినిచ్చింది

ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ


శివం ఉపాధ్యాయను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది

బొమ్మలరామారం: బొమ్మలరామారంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన శిక్షణా సమయం తనకు సంతృప్తిని ఇచ్చిందని ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ అన్నారు. ఐపీఎస్ ట్రైనింగ్‌లో భాగంగా ఆయన మూడు నెలల శిక్షణ కాలం పూర్తి చేసుకుని తదుపరి శిక్షణకు పోలీస్ అకాడమీకి వెళ్తున్నారు. ఈసందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన సమయంలో మండలంలో చోటు చేసుకున్న రెండు భారీ నగదు చోరీ కేసులతోపాటు మరో రెండు ప్రాపర్టీ దొంగతనం కేసులను 24 గంటల్లో చేదించానన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని విభాగాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. మండలంలో క్రిమినల్ కేసుల నమోదు తక్కువగా ఉందని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సిబ్బంది సహకారం చాలా బాగుందన్నారు. మండల ప్రజలు మనోభావాలను సైతం అధ్యయనం చేశానన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేయాలంటే లా అండ్ ఆర్డర్ నియంత్రించే పోలీస్ శాఖతోనే సాధ్యమని చెప్పారు. మరో ఐదు నెలల శిక్షణ అనంతరం ఎస్పీగా విధుల్లో చేరనున్నట్లు వెల్లడించారు. 28 సంవత్సరాల వయసులోనే ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐలు కృష్ణ, చంద్రమ్మ, అంజయ్య, మధు, నాగార్జున, జనార్దన్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

కోర్టు కేసులో రాజీపడినందుకు దాడి

- ఒకరు మృతి


లక్ష్మయ్య (ఫైల్)

వలిగొండ : కోర్టు కేసులో రాజీ పడినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన ఘటన వలిగొండ మండలంలోని గోకారంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరు లక్ష్మయ్య(55) తన కుటుంబానికి, పాలి వారైన చిన్న లక్ష్మయ్యకు ఉన్న ఓ వివాదం కేసులో ఇటీవల కోర్టులో రాజీ పడ్డాడు. దీంతో వరుసకు తమ్ముని కొడుకైన బైరు రామస్వామి, ఆయన భార్య రమ్య, తల్లి సిద్ధమ్మతో కలిసి శనివారం రాత్రి లక్ష్మయ్య ఇంటికి వెళ్లాడు. తమకు తెలియకుండా కోర్టులో ఎలా రాజీ పడతారని టీవీ చూస్తున్న లక్ష్మయ్య కోడలు శైలజను దూషించి దాడి చేశారు. ఈక్రమంలో వారిని అడ్డుకునేందుకు వెళ్లిన బైరు లక్ష్మయ్యపై ఈ ముగ్గురు కలిసి దాడి చేశారు. అతడి చాతిపై బలంగా కొట్టడంతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రామన్నపేట సీఐ మోతీరాం ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని పాదయాత్ర


కట్టంగూర్‌లో అల్లం రామారావుకు స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ బలరాములు

కట్టంగూర్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అల్లం రామారావు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 1వ తేదీన చేపట్టిన యాత్ర శనివారం కట్టంగూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు ఆయనకు స్వాగతం పలికారు. అల్లం రామారావు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ పెంచిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గాదపాక కన్నయ్య, చిగుళ్ల సైదులు, కటికం శ్రీను ఉన్నారు.

వివాదాస్పదంగా పంచాయతీ నూతన భవన స్థలం


గ్రామ పంచాయతీ భవనం కోసం పల్లె ప్రకృతి వనంలో తొలగించిన చెట్లు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడెంలో గ్రామ పంచాయతీ భవనం కోసం గుర్తించిన స్థలం వివాదాస్పదంగా మారింది. గ్రామానికి నూతన పంచాయతీ భవనం మంజూరైంది. ప్రస్తుతమున్న భవన స్థలం తక్కువగా ఉన్నందున గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో స్థలాన్ని గుర్తించారు. అంతేకాకుండా అక్కడ ఉన్న చెట్లను సైతం తొలగించారు. అయితే గ్రామస్తులను సంప్రదించకుండా సర్పంచ్, ఎంపీడీఓ స్థలాన్ని గుర్తించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ముగ్గు పోసేందుకు డీఈ నాగయ్య, సిబ్బందితో కలిసి శనివారం గ్రామానికి రావడంతో వేరే చోట ప్రభుత్వ స్థలం ఉండగా పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి భవనాన్ని నిర్మించడమేంటని స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి వివరణ కోరగా వేరే చోట స్థలం లేకపోవడంతో పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ భవనానికి స్థలం గుర్తించామని తెలిపారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వేరే చోట ప్రభుత్వ భూమిని గుర్తిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

హాలియా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హాలియా పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇచ్చి వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సుప్రీ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కి రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అంబటి మణెమ్మ, సుగుణమ్మ, రాజేశ్వరీ, పద్మలత, వజ్రమ్మ, విజయ, కృష్ణవేణి సైదమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

కాళోజీని ఆదర్శంగా తీసుకోవాలి



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం కాళోజీ 109వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంజీయూ తెలుగు విభాగం అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు అధ్యాపకుడు సత్యనారాయణ మాట్లాడుతూ కాళోజీ ప్రజాకవిగా రాణించారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అధ్యాపకురాలు అనిత కుమారి మాట్లాడుతూ స్త్రీ అభ్యున్నతికి కాళోజీ ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ మాండలికాన్ని తన రచనల ద్వారా ప్రజలకు తెలియజేశారని పేర్కొన్నారు.

అన్నెపర్తి బెటాలియన్‌లో..

అన్నెపర్తి 12 వ బెటాలియన్‌లో కాళోజి చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ ఎన్వీ సత్య శ్రీనివాస్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు వెంకన్న, శ్రీనివాస్, యుగేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరవలేనివి


కాళోజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా: ప్రముఖ ప్రజా కవి కాళోజీ నారాయణరావు సమాజానికి చేసిన సేవలు మరవలేనివని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూడావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా శనివారం అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో మూడావత్ జగన్‌బాబు(ఐఆర్ఎస్), కందుల మదన్‌రెడ్డి, మేగావత్ లోక్‌నాథ్, కందుల నారాయణరెడ్డి, మేగావత్ మంగ్యానాయక్, రమావత్ సర్దార్, బాణావత్ దీప్లా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజస్వీనిఖిల్

తుర్కపల్లి : మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత, బీఆర్ఎస్ నాయకుడు గట్టు తేజస్వీనిఖిల్ శనివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసైని కలిశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించడానికి కలిసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

● 'యాదాద్రి'లో ఉట్లోత్సవం


యాదాద్రి ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట నిర్వహించిన ఉట్లోత్సవంలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి, దేవస్థాన సిబ్బంది తదితరులు


శ్రీకృష్ణుడి అలంకరణలో స్వామి అమ్మవార్లని ఉట్లోత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయాధికారులు


ప్రధానాలయ వీధుల్లో భక్తుల రద్దీ


రుక్మిణీ కల్యాణ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి


తూర్పు రాజగోపురం ఎదుట ఉట్లోత్సవాన్ని తిలకిస్తున్న ఆలయాధికారులు, భక్తులు